## క్లుప్తంగా

### బడి బాటలో క్రీడలు



**వాజేడు:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడలను నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ తదితర ఆటను ఆడించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సోయం అనందరావు మాట్లాడుతూ చదువుతోపాటు వివిధ ఆటల్లో ప్రావీణ్యం సాధించాలని, ఆటలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, వెంకటరమణ, ఆనంద్, శ్రీకాంత్, కుమార్‌బాబు, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, రాజేష్, వస్య, శ్రీరంగం తదితరులున్నారు.

### 21న యోగా శిక్షణ

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యోగా గురువు ఎర్రంకని రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు యోగా శిక్షణను వినియోగించుకోవాలన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆయన కోరారు.

### కేసు నమోదు



**ఏటూరునాగారం:** అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా గోవిందరావుపేట మండలం రాంనగర్ తండా ప్రాంతానికి చెందిన అజ్మీరా మౌనిక 20 లీటర్ల గుడుంబాతో తారసపడింది. ఈ మేరకు ఆమెను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### విధులు, బాధ్యతలపై శిక్షణ



**మంగపేట:** మండల కేంద్రంలోని జ్యోతి మండల సమాఖ్య(ఐకేపీ) కార్యాలయంలో ఏపీఎం అప్పారావు ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన గ్రామ సమాఖ్య పదాధికారులు (అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి)కి విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈఆర్‌పి(సెర్ప్) స్టేట్ సీనియర్ సీఆర్పీ పావని నజీమా హాజరై గ్రామ సంఘంలో సంస్థాగత నిర్మాణం, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, ఆర్థిక విధానాలు, సామాజిక అంశాలు, రుణాల మంజూరు, సంఘాలు, సభ్యుల జీవనోపాధి పెపొందించే కార్యక్రమాలు, వారి స్థితి గతులను మెరుగుపర్చడానికి చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సులోచన, మల్లేశ్వరి, శ్రీను, జనార్ధన్, కృష్ణవేణి, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

### కుల, మతాలపై అవగాహన సదస్సు



**వెంకటాపురం(కె):** మండల పరిధిలోని నూగూరు గ్రామంలో గురువారం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కుల మతాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ కార్యదర్శి వేణు హాజరై మాట్లాడారు. కుల మతాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో అందరూ ఒక్కటేనని అన్నారు. కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ వెంకటాపురం, వాజేడు మండలాల కోఆర్డినేటర్లు గొంది హనుమంతు, కామేష్, యానిమేటర్లు ఉష, ఇందిర, పద్మ, నరేష్ ఉన్నారు.

### పనులు ప్రారంభం

**పలిమెల:** మండలంలోని పంకెన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు అధికారులు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

# ఆఖరి మజిలీకి అవస్థలు

- శ్మశాన వాటికలో కరువైన విద్యుత్ సరఫరా
- కానరాని నీటి సౌకర్యం
- వాగులు, వంపుల వద్దకు పరుగులు

**వెంకటాపురం(కె):** ఆఖరి మజిలీ సజావుగా సాగాలని గత ప్రభుత్వం వైకుంఠధామాలను నిర్మించింది. కానీ, నిర్వహణ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు చనిపోయి దుఃఖంలో ఉన్నవారికి వైకుంఠధామాల్లోని అసౌకర్యాలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలోని 18 పంచాయతీల్లో వైకుంఠధామాలను నిర్మించారు. కానీ, విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించలేదు. కొన్నిచోట్ల బోరు మోటార్ పనిచేయని పరిస్థితి. చాలా చోట్ల ట్యాంకర్లతో నీరు తెచ్చుకొని కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అయితే వైకుంఠధామాలు ఊరికి దూరంగా ఉండడంతో విద్యుత్ సరఫరా అందించలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో చీకట్లోనే అంత్యక్రియలు చేయాల్సివస్తుందని



విద్యుత్ సౌకర్యం లేని వీరభద్రవరం వైకుంఠధామం

ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సౌకర్యాలు కరువు**

శ్మశాన వాటికల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా స్నానాల గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ నీటిసౌకర్యం లేకపోవడంతో ట్యాంకర్లతో నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. లేదంటే దగ్గరలో ఉన్న వాగులు, వంపులు, వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి చేయాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. దహన సంస్కారాలను అరకొర వసతుల నడుమ పూర్తి చేయడం ఇబ్బందిగా మారిందని.. సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకటాపురంలో నిరుపయోగంగా ఉన్న బాత్రూమ్స్

**నిధుల లేమితో ఇబ్బందులు..**



శ్మశాన వాటికల్లో విద్యుత్ సరఫరా సౌకర్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నిధులు లేక పంచాయతీలను నెట్టుకొస్తున్నాం. అనుకున్న స్థాయిలో విడుదల కావాల్సిన నిధులు పంచాయతీలకు అందడంలేదు. కానీ, వైకుంఠధామాల్లో పరిస్థితిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తా..

– రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

## షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి

- షీ టీం ఎస్సై మౌనిక

**గోవిందరావుపేట:** మహిళలు, బాలికలు, విద్యార్థినులు షీ టీమ్స్ సేవలు వినియోగించుకోవాలని షీ టీమ్ ఎస్సై మౌనిక అన్నారు. మండలంలోని పస్రా జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం విద్యార్థినులకు షీ టీమ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక మాట్లాడుతూ.. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలు, తెలంగాణ మోడల్, రెసిడెన్షియల్, కేజీబీవీ స్కూల్స్ వద్ద నిరంతరం షీ టీమ్స్ బృందాల నిఘా ఉంటుందన్నారు. ఇబ్బందులు ఉంటే వెంటనే 100, లేదా షీ



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

టీమ్ నంబర్ 87126 70115 కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించాడు. కార్యక్రమంలో పస్రా 2వ ఎస్సై సీహెచ్ ఎర్రయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరామర్శ

**వెంకటాపురం(కె):** భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు పరామర్శించారు. ఇటీవల విజయ్ తండ్రి మృతి చెందడంతో గురువారం వారి స్వగ్రామం వెంగలరావుపేటలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పల కృష్ణమూర్తి, రామెళ్ల శేఖర్, బోల్లే సునీల్, శ్రీకిషన్, మట్టి రమేష్, కోగిల శ్రీను, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.



సంతాపం తెలుపుతున్న నాయకులు

## వాహనచోదకులు హెల్మెట్ వినియోగించాలి



యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

**వాజేడు:** ద్విచక్రవాహనం నడుపుతున్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పేరూరు రైతు వేదికలో గురువారం తమ పరిధిలోని గ్రామాల ప్రజలతో ఆయన అభయ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 20న స్పెషల్ డ్రైవ్ ఉందని ద్విచక్ర వాహనం ఉన్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం నకిలీ విత్తనాలు, సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. రాంపురం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. జంగాలపల్లిలో గ్రామ యువతతో మాట్లాడారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతి



వాజేడు: పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్



కన్నాయిగూడెంలో అవగాహన ర్యాలీ..

**వెంకటాపురం(కె):** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నూగూరు, కొండాపురం, గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశీష, మనోహర్, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

**దోమల మందు పిచికారీ**

మండల పరిధిలోని మల్లపురం, కర్రావానిగూంపు గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ రాఘవులు మాట్లాడుతూ.. గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నామన్నారు. దోమలు రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది రాజేష్, కరుణ తదితరులు ఉన్నారు.

**ఆరోగ్య సలహాలు పాటించండి**

**వాజేడు:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సూత్రాలను పాటించాలని వాజేడు, పేరూరు వైద్యులు కొమరం మహేందర్, రాహిల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఘణపురం కాలనీలో మహేందర్ ఆధ్వర్యంలో సికిల్ సెల్‌పై ఇంటింటి సర్వేలను నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారికి మందులను ఇచ్చారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. పేరూరు వైద్యశాల పరిధిలోని చెరుకూరు, ములకనపల్లి గ్రామాల్లో డాక్టర్ రాహిల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాల్లో హెచ్ఈఓ వేణుగోపాలకృష్ణ, కోటిరెడ్డి, వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

**సమష్టి కృషితోనే సికిల్ సెల్ నివారణ**

**కన్నాయిగూడెం:** సమష్టిగా కృషి చేస్తేనే సికిల్ సెల్ వ్యాధిని నివారించవచ్చని డాక్టర్ అభినవ్ అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది మండల కేంద్రంలోని రహదారిపై గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. సికిల్ సెల్ రక్త హీనత తొలగించడానికి తీసుకోవాలిన సలహాలు, సూచనలు ప్రజలకు తెలపారు. 2047 నాటికి రక్తహీనత లేని సమాజం నిర్మించాని పిలుపునిచ్చారు. దేశంలో గిరిజనులను ప్రభావితం చేస్తున్న పది వ్యాధుల్లో సికిల్ సెల్ ఎనీమియా ఒకటిగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గుర్తించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బంగారు వరప్రసాద్, సూపర్ వైజర్ రమణ కుమారి, ఏఎస్ఎం కవిత, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

- చిటమట రఘు

**ఏటూరునాగారం:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో రైతుల్లో ఎంతో భరోసా నిండిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు కావాల్సిన పథకాలను అందిస్తూ అభివృద్ధిలోకి తీసుకొస్తున్నారని రఘు అన్నారు. అంతేకాకుండా వరిధాన్యానికి క్వింటాకు బోనస్ కింద రూ.500 చెల్లించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇటీవల అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం కోసం రూ. 5.40 కోట్లు మంత్రి సీతక్క ద్వారా మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు అయూబ్, దేవేందర్, ఖలీల్, ముక్కెర లాలయ్య, వావిలాల ఎల్లయ్య, నర్సింహరావు, నవీన్, సులేమాన్, శ్రీనివాస్, లక్కీ, రియాజ్, గౌస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

**ములుగు రూరల్:** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలకు రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గట్టమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ వద్ద నుంచి ఇంచర్ల ఎంఆర్ గార్డెన్ వరకు సుమారు 3 వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గార్డెన్‌లో మంత్రి సీతక్క కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, యువజన కాంగ్రెస్ నాయకుడు సూర్య, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనరెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సామ రాంమోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జలీల్, కైలాస్ పాల్గొన్నారు.

**వెంకటాపురం(కె):** మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో చిడెం మోహనరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు మన్నెం సునీల్, కళాధర, సీతాదేవి, రవి, వేణు, శివ, సాయి, రంగయ్య నాయుడు ఉన్నారు.

### 45 పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలను అందజేస్తున్న ఎంఈఓ

**వెంకటాపురం(కె):** మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మండలంలోని 45 పాఠశాలలకు వంట పాత్రలు మంజూరయ్యాయి. వంట పాత్రను గురువారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట పాత్రను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని అన్నారు. మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, నర్సింహస్వామి, భుజంగరావు, మండల విద్యావనరుల సిబ్బంది ఆదిలక్ష్మి, యశోద, సీఆర్పీ రాంబాబు తదితరులు ఉన్నారు.

## జిల్లా సైన్స్ అధికారిని తొలగించాలి

- జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్

**గోవిందరావుపేట:** విద్యాశాఖలో అవినీతి సూత్రదారి అప్పని జయదేవ్‌ని ఏసీజీఈ జిల్లా సైన్స్ అధికారి పదవి నుంచి తొలగించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇటీవల డీఈఓ పాణిని ఏసీబీకి పట్టుబడిన విషయాన్ని కమిటీ సభ్యులు చర్చించారు. సంవత్సర కాలంగా జిల్లా విద్యాశాఖలో విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతి బాగోతాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బయట పెట్టిందని, జిల్లా విద్యాశాఖలో సైన్స్ అధికారి జయదేవ్ చేసే ఆర్థిక అరాచకత్వాలను బట్టబయలు చేసిందని అన్నారు. డీఈఓ అవినీతి కూపంలో మునిగి భ్రష్టు పట్టడానికి సూత్రదారి జయదేవ్ అని.. ఇప్పటికైనా ఏసీజీఈ, జిల్లా సైన్స్ అధికారి విధుల నుంచి తొలగించి, అతని అవినీతి చర్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీలో భాగస్వాములైన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులు వాసుదేవ రెడ్డి, చాప బాబు, గన్ రెడ్డి ఆది రెడ్డి, రేగా నరేంద్ర కుమార్, తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు నాగరాజు, ఉప్పస్వామి, హట్కర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ బాధ్యులు

## ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో కళాజాతా

**వెంకటాపురం(ఎం):** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గురువారం మండలంలోని రామాంజాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారధి కోఆర్డినేటర్ రాగుల శంకర్ బృందం కళాజాతా నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో కళాప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు మార్త రవి, గోల్కొండ బుచ్చన్న, రహీమొద్దీన్, రాజేందర్, విజయ్‌కుమార్, కిషన్, సాగర్, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న కళాకారులు

### లారీ ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

**ఏటూరునాగారం:** ఇసుకలారీ ఢీకొని ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. గోవిందరావుపేట మండలం పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బడే ఫణికుమార్ పని ముగించుకుని తన గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చిన్నబోయినపల్లి చింతలమోరి ప్రాంతంలో ఇసుక లారీ ఢీకొట్టగా అతని తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఎంజీఎంకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే తన వద్ద పుస్తకాలు ఉండడంతో వారి పిల్లల కోసం ఏటూరునాగారంలో బుక్స్ కొనుగోలు చేసుకొని వెళ్తున్నట్లుగా తెలుస్తోంది.

## మాకు న్యాయం చేయండి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట తల్లీబిడ్డల నిరసన

**మంగపేట:** మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కోరుకొప్పుల సత్యం అనారోగ్యంతో మృతి చెందగా ఉమ్మడి కుటుంబంలో తమకు రావాల్సిన వాటాను కుటుంబ సభ్యులు అమ్ముకున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సత్యం భార్య కొరుకొప్పు రాణి, కుమార్తెలు రేణు అక్షయ, రేణు అక్షిత.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యం కమలాపురంలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుంటుంబాన్ని పోషించేవాడని, పక్షవాతం రావడంతో తమ ఇబ్బందులను వివరిస్తూ వైద్యం కోసం దాతలు సాయం చేయాలని కోరుతూ వాట్సాప్ గ్రూపులో పోస్టుచేసినట్లు తెలిపారు. స్పందించిన దాతల ద్వారా సత్యం తమ్ముళ్లు రాజు, నరేష్ ఫోన్‌పే నంబర్లకు రూ.7 లక్షలు జమ అయినట్లు తెలిపారు. సత్యం తండ్రి పిచ్చయ్య కుమారుడి వైద్యఖర్చులకు మరో రూ.3 లక్షలు ఇచ్చాడని తెలిపారు. ఆస్పత్రి ఖర్చులు రూ.4 లక్షల వరకు కాగా మిగిలిన డబ్బులను వారే ఉంచుకున్నట్లు తెలిపారు. అంతే కాకుండా తమకు రావాల్సిన 5 గుంటల భూమి ఇవ్వకుండా తమ ఇద్దరు కుమార్తెలను బెదిరించి సంతకాలు చేయించి వేరొకరికి అమ్ముకున్నారని చెప్పారు. దీంతో న్యాయం చేయాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా గ్రామానికి చెందిన ఓ పెద్దమనిషి కేసు వాపసు తీసుకోవాలని బెదిరించడంతో ఎస్పీని ఆశ్రయించినట్లు వాపోయారు. ఎస్పీ ఆదేశాలతో ఏటూరునాగారం సీఐ తమకు న్యాయం చేయాలని స్థానిక ఎస్సైకి సూచించారన్నారు. తమ వాటా తమకు తిరిగి ఇవ్వాలని తహసీల్దార్ చెప్పినా పట్టించుకోకుండా దుర్భాషలాడుతూ.. దాడికి యత్నిస్తున్నారని విషయంపై కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న తల్లీబిడ్డలు

## ‘బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి’

**కన్నాయిగూడెం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశాయని అన్నారు. మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దేవాదుల పంపింగ్ నుంచి ఏజెన్సీ ప్రాంతాలైన కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, ఎస్ఎస్‌తాడ్వాయి మండలాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని పోరాటం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇక్కడి ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాల్లో కూడా సముచిత స్థానం లభించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా బుచ్చయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ గద్దల హరిబాబు, మండల ప్రధాన కార్యదర్శులు నగం ఆనంద్, ఆకుతోట మధుకర్, మండల ఉపాధ్యక్షురాలు పానుగంటి సంగీత, కర్నె సంపత్, గాడిచర్ల రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వరూప

### ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై విచారణ చేయాలి

**మంగపేట :** మండలంలోని చెరుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని అర్హులైన తమకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీఓ భద్రుకు గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకోసం గ్రామంలో రచ్చబండ నిర్వహించి ఆర్థికంగా వెనుకబడిన, ఇళ్లు లేనివారి పేర్లను ప్రతిపాదించి ఇందిరమ్మ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమ పేర్లను తొలిగించి వారికి అనుకూలమైన వారికి ఇళ్లు మంజూరు చేయించి తమను మోసం చేశారని తెలిపారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ నిబంధనల మేరకు తమకు న్యాయం చేయాలని కోరారు. ఎంపెల్లి సమ్మక్క, నగ్మ, చంద్రకళ, నర్సమ్మ, మాణిక్యం, సావిత్రి పాల్గొన్నారు.